# నవ్యాంధ్రప్రదేశ్‌కు నవ బడ్జెట్

## మూసధోరణికి చరమగీతం : ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 16 : పాత మూస పద్ధతులతో ఏమీ సాధించలేమని, కొత్త విధానాలతోనే అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ వాస్తవం తెలుసుకుని ప్రభుత్వ లక్ష్యాలకు తగ్గట్టు పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ శాఖల పనితీరుపై వివిధ ఏజెన్సీలు ఇస్తున్న ర్యాంకింగులను కూడా పరిగణనలోకి తీసుకుని పనితీరు మెరుగుపరుచుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖాధిపతులు, కార్యదర్శులు, మంత్రులతో శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి బడ్జెట్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు.

కాలంచెల్లిన చట్టాలను రద్దు చేసి, కాలానుగుణంగా సరికొత్త విధానాలు రూపొందిస్తున్నామని తెలిపిన ముఖ్యమంత్రి ఇది పరీక్షా సమయమని చెప్పారు. రాష్ట్ర సుస్థిర వృద్ధి, ప్రజల సంతృప్తి అంతిమ లక్ష్యంగా రానున్న బడ్జెట్‌ను రూపొందాలని మార్గదర్శనం చేశారు. ఎంతమేర నిధులు అవసరమో అన్ని ప్రభుత్వ శాఖలు అంచనాలు సిద్ధం చేసుకోవాలని, అభివృద్ధిలో ఎక్కడ వున్నామనే దానిపై ప్రతి శాఖ స్వీయ విశ్లేషణ చేసుకోవాలని చెప్పారు.

అన్ని శాఖలలో సంస్కరణలు తీసుకొస్తున్నా, కొన్ని శాఖల్లో ఇంకా ఆశించిన పురోగతి కనిపించడం లేదని ముఖ్యమంత్రి అన్నారు. విద్యుత్, వ్యవసాయం, జలవనరులు తదితర శాఖలలో తీసుకున్న నిర్ణయాలు సానుకూల ఫలితాలను ఇచ్చాయని చెప్పారు. ముఖ్యంగా విద్యుత్ శాఖలో మంచి ఫలితాలు సాధించామని, ఆ శాఖలో సంస్కరణలు ప్రారంభించి సఫలమయ్యామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇదే విషయంలో మనకంటే ముందే సంస్కరణలు తెచ్చినా ఒడిశా రాష్ట్రం విఫలమైందని వివరించారు. ఉత్తమ ఫలితాలు సాధించడం ద్వారా పంచాయతీరాజ్ శాఖ ఎన్నో పురస్కారాలు దక్కించుకుందని చెప్పారు. జలవనరుల శాఖలో ప్రవేశపెట్టిన విధానాలు, చేపట్టిన కార్యక్రమాలతో భూగర్భజలాలు పెంచగలిగామని, దీంతో వర్షపాతం తక్కువ నమోదైనా వ్యవసాయ విద్యుత్ వినియోగం బాగా తగ్గిందని చెప్పారు.

‘ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్’లో ఇంటర్నేషనల్ బెంచ్ మార్క్ చేరుకోవడానికి కృషి చేస్తున్నామని చెప్పిన ముఖ్యమంత్రి– సీఐఐ భాగస్వామ్య సదస్సులో దీనిపై ప్రత్యేకంగా ఒక సెషన్ నిర్వహించి కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీల మేరకు కేంద్రం నుంచి సక్రమంగా సాయం అందడం లేదని చెప్పారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో అన్ని వనరులు వున్నప్పటికీ వృద్ధిలో మాత్రం వెనుకబడి వున్నాయని, సమగ్ర దృష్టి, సరైన దృక్పథం లేకపోవడమే ఈ జిల్లాల వెనుకబాటుకు కారణమని అన్నారు. అత్యుత్తమ విధానాలు అనుసరించడం ద్వారా ఈ జిల్లాలను అభివృద్ధిలో ముందువరుసలో నిలుపవచ్చని ముఖ్యమంత్రి చెప్పారు. వెనుకబడిన జిల్లాలపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నామని తెలిపారు.

విజ్ఞాన సముపార్జనతోనే వ్యక్తులు, సంస్థలు, సమాజాలు అభివృద్ధి చెందుతాయని ముఖ్యమంత్రి అన్నారు. ఏపీని విజ్ఞాన బాంఢాగారంగా మలచాలనేదే తన లక్ష్యమని, ఇందుకోసం ఎక్కడా రాజీ పడేది లేదన్నారు. సాంకేతికత వినియోగించుకోవడంలో రాష్ట్రం ముందంజలో వుందని గుర్తుచేశారు. ఓడీఎఫ్ తరహాలో రాష్ట్రంలో పీహెచ్ఎఫ్ (పాట్ హోల్స్ ఫ్రీ)కి వెళ్లాలని నిర్దేశించుకున్నట్టు వెల్లడించారు. మార్చి తొలివారంలో బడ్జెట్ సమావేశాలు ప్రారంభించి 5న గవర్నర్ ప్రసంగం, 8న రాష్ట్ర వార్షిక బడ్జెట్ ప్రవేశపెడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.